పొంచి ఉన్న ప్రమాదం



- నలుగురు నడిచే చోట ట్రాన్స్‌ఫార్మర్లతో భయం భయం
- సర్వీస్ రోడ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ అధికారులు
- కొన్ని చోట్ల శబ్దాలు వస్తూ.. నిప్పులు రాల్చుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- కలవరపడుతున్న పాదచారులు, వాహన చోదకులు

ఆర్‌కేపురం సేవా మార్గంలో ఏర్పాటు చేసిన 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్



శ్రీహరిపురం బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన 315 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో గల **సేవా మార్గాల్లో** ఏపీఈపీడీసీఎల్ (విద్యుత్ విభాగం) **అధి**కారులు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు **ప్రమాదక**రంగా మారాయి. వాటి సమీపం నుంచి **రాకపో**కలు సాగించేందుకు పాదచారులు, **వాహన** చోదకులు భయపడుతున్నారు.

పాత సమస్య పోయి.. కొత్త సమస్య మొదలు..

పారిశ్రామిక ప్రాంతంలో జనాభా పెరగటంతో విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో మల్కాపురం, శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల అధికారులు ఇటీవల కొత్తగా పలు ప్రాంతాల్లో 100 కేవీ నుండి 315 కేవీ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ కోతలు, సరఫరాలో హెచ్చుతగ్గులు, లోవోల్టేజీ సమస్యలు అధిగమించగలిగారు. అయితే ఇక్కడే కొత్త సమస్య వచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు నలుగురు మసిలే దారిలో ఉండటం వల్ల అంతా కలవరం చెందుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల నుండి అప్పుడప్పుడు శబ్దాలు వస్తూ నిప్పులు కూడా వెదజల్లుతున్నట్లు స్థానికులు భయపడుతున్నారు. శ్రీహరిపురం బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన 315 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌లోకి ఎవరూ వెళ్లకుండా రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో చిన్నపిల్లలు దాని సమీపానికి వెళ్తారేమో అని అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మల్కాపురం బస్టాప్ వద్ద, ఆర్‌కేపురం చర్చి లైన్ సమీపంలో, పాత పెట్రోల్ బంక్

కంచె నిర్మిస్తే మంచిది



మల్కాపురంలోని పలు చోట్ల ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయలేదు. ఇలాంటి ట్రాన్స్‌ఫార్మర్లను ఏవైనా వాహనాలు ఢీకొంటే పెద్ద నష్టం తప్పదు. అలాగే పిల్లలు తెలియక తాకినా ప్రమాదమే. అధికారులు ఈ సమస్యపై స్పందించాలి.

– శీర చిన్నాజీ యాదవ్, పాదచారుడు

సేవా మార్గాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు వద్దు



వాహనాలు రాకపోకలు సాగించే చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఒక్కోసారి వాటి నుంచి శబ్దాలు వస్తూ నిప్పురవ్వలు రాలుతున్నాయి. సేవా మార్గాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలి. అధికారులు ఈ సమస్యపై స్పందించాలి.

– కాకర ప్రకాష్, వాహనదారుడు

సేవా మార్గాల వద్ద 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినప్పటికీ అందులోకి ఎవరూ వెళ్లకుండా ఎలాంటి కంచె నిర్మించలేదు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సబ్‌స్టేషన్ల అధికారులు స్పందించి సేవా మార్గాల్లో కాకుండా జన సంచారం తక్కువగా ఉండే చోటుకు ట్రాన్స్‌ఫార్మర్లను తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా భవానీ అంబలం పూజ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీనివాస్‌నగర్‌లో భవానీ భక్తులు గురువారం ఘనంగా అంబలం పూజలు నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి వందలాది గ భవానీ భక్తులు పాల్గొని అమ్మవారి పీఠం వద్ద దుర్గాదేవి కీర్తనలను ఆలపించారు. ఆరడుగుల ఎత్తుతో కూడిన దుర్గాదేవి విగ్రహాన్ని నిర్వాహకులు పీఠం వద్ద ఏర్పాటు చేసి పూజలు జరిపారు. అనంతరం భవానీ మాల ధారులకు ప్రసాదం పంపిణీ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుల్లలపాలెం వుడా కాలనీ పరిధి మార్కెట్ ఏరియా, పాత్రుడు కాలనీ, శ్రీహరిపురం మెయిన్ రోడ్డు ఏరియా, వీటీ కాలేజీ రోడ్డు ఏరియా, పాత రామాలయం వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

బాడీబిల్డర్‌కు సత్కారం



బాడీ బిల్డర్ శివశంకర్‌ను సత్కరిస్తున్న మైక్‌టైసన్ బాక్సింగ్ క్లబ్ ప్రతినిధులు

మల్కాపురం: బాడీబిల్డింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన శివశంకర్‌ను మైక్‌టైసన్ బాక్సింగ్ క్లబ్ ప్రతినిధులు గురువారం ఘనంగా సత్కరించారు. శ్రీహరిపురానికి చెందిన శివశంకర్ ఇండియన్ ఆర్మీలో ఉన్నత హోదాలో ఉన్నారు. చిన్ననాటి నుంచి బాడీబిల్డింగ్‌పై మక్కువ ఎక్కువ ఉండటంతో ఈ క్రీడలో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా మైక్‌టైసన్ బాక్సింగ్ క్లబ్ నిర్వాహకులు 60వ వార్డు గుల్లలపాలెంలోని వాకింగ్ పార్కులో ఆయనను సత్కరించి, అభినందించారు. బాడీబిల్డింగ్‌లో శివశంకర్ ఉన్నత స్థాయికి చేరాలని సీనియర్ బాక్సర్లు, బాక్సింగ్ కోచ్‌లు ఆకాంక్షించారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన అవసరం

అక్కిరెడ్డిపాలెం: విద్యుత్ పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు అన్నారు. గాజువాక శ్రీనగర్‌లోని టీఎస్ఆర్, టీబీకే కళాశాలలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. పీఎం సూర్య ఘర్ (సోలార్ రూఫ్ టాప్), విద్యుత్ సమస్యలు, ఏపీఈపీడీసీఎల్ ఏపీపీ ద్వారా డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రామకృష్ణ, ఆటోనగర్ ఏఈ చంద్రశేఖర్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ గురువారం సందర్శించారు. పాఠశాలలో 10వ తరగతి ప్రత్యేక తరగతి గదులను పరిశీలించారు. పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారో విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ రికార్డులను పరిశీలించి ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి, దేముళ్లు, రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సు



అర్జీలు స్వీకరిస్తున్న కార్పొరేటర్ వెంకటరమేష్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాల నాగేంద్ర కాలనీ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు తూతూమంత్రంగా జరిగింది. ఈ సదస్సులో అధికారులు కానరాలేదు. స్థానిక కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ అర్జీలు స్వీకరించారు. ప్రజల బాధలు వినేందుకు, సమాధానం చెప్పేందుకు అధికారులు లేకపోవడంతో ప్రజలు నిరాసతో వెనుదిరిగారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజల సమస్యలు వెంటనే తీర్చేస్తామని చెప్పినా క్షేత్రస్థాయిలో దీనికి విరుద్ధంగా జరుగుతోంది. సదస్సుకు కనీసం రెవెన్యూ అధికారులు హాజరు కాలేదు. స్పెషల్ ఆఫీసర్ కూడా హాజరవలేదు. టీడీపీ నాయకులే కనిపిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్ఐ, సర్వేయర్ మాత్రమే హాజరయ్యారు. జీవీఎంసీ జోన్-8 కమిషనర్ కూడా ఈ కార్యక్రమానికి రాకపోవడంతో స్థానికులు నిరాశకు గురయ్యారు. వేదికపై అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గవ్వ భాస్కర్ అధికారిలా కూర్చోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి కార్యక్రమాల్లో ప్రజలకు ఏ విధమైన న్యాయం జరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వేదికపై ఇద్దరు అధికారులు, ఒక కార్పొరేటర్, ముగ్గురు టీడీపీ నాయకులు కూర్చుని ఉన్నారని, ఇది టీడీపీ నాయకుల సమావేశంలా తయారయిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

అగనంపూడి : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించాలని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉక్కు కార్యదర్శి సంజయ్ రాయ్‌ను వినతిపత్రాల్లో కోరామని పరిరక్షణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెంలోని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ రిలే దీక్షా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వారు మాట్లాడారు. వేతన బకాయిలు చెల్లించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల్లో కోత విధిస్తూ కొంతకాలంగా యాజమాన్యం విధిస్తున్న ఆంక్షలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కర్మాగారానికి ప్రభుత్వం మూడేళ్లపాటు టాక్స్ హాలీడే ప్రకటించాలని, స్టీల్‌ప్లాంట్ భూములను ఆర్ఐఎన్ పేరున బదిలీ చేయాలని, యాజమాన్యం, కేంద్రం విధించిన ఆంక్షల వల్ల ఉక్కు కర్మాగారానికి జరిగిన నష్టాన్ని పూడ్చడానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, కె.సత్యనారాయణరావు, కామేశ్వరరావు, డేవిడ్, కారు రమణ, మసేనురావు, రామకృష్ణ, సుబ్బయ్య, దేముడు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ తదితరులు

అంతా అధ్వానం



జాతీయ రహదారి రెడ్డి కంచరపాలెంలో నిర్లక్ష్యంగా వదిలేసిన ఇనుప గ్రిల్స్

- అసంపూర్తి పనులతో నిరుపయోగంగా గ్రీన్‌బెల్ట్ గ్రిల్స్
- ఇనుప గ్రిల్స్, ఓపెన్ జిమ్ సామగ్రి చోరీ
- స్పందించని ఇంజినీరింగ్ అధికారులు

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం జాతీయ రహదారి ఊర్వశి కూడలి, తాటిచెట్లపాలెం వెళ్లే మార్గంలో గ్రీన్‌బెల్ట్‌లో ఓపెన్ జిమ్‌లు, రక్షణ గేట్లు వాకింగ్ ట్రాక్‌లు నిర్లక్ష్యంగా వదిలేయడంతో అధ్వానంగా మారాయి. జీవీఎంసీ జోన్ – 5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ నిరుపయోగంగా వదిలేయడంతో దొంగల పాలవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెడ్డికంచరపాలెం, ధర్మానగర్, తిక్కవానిపాలెం, వివేకానందనగర్, రవీంద్రనగర్, దేవేంద్రనగర్‌కు వెళ్లే మార్గాల్లో ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాకులు శిథిలావస్థకు చేరకున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుందరంగా నిర్మించారు. 90 శాతం పనులు పూర్తయిన సమయానికి సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపివేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా పనులు ప్రారంభించకపోవడంతో గ్రీన్‌బెల్ట్‌లు అధ్వానంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో గ్రిల్స్‌బెల్ట్ ప్రాంతాలను ఆనుకుని ఇనుప గ్రిల్స్ నిర్లక్ష్యంగా వదిలేయడంతో తుప్పు పట్టి మూలకు చేరాయి. మరికొన్నింటిని దొంగలు అపహరించుకుపోతున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు, వాకర్స్ వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, గ్రిల్స్‌కు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మైదానం నిర్మాణానికి భూమిపూజ



క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో కొత్త మైదానం ఏర్పాటుకు గురువారం ఘనంగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు గల్లా చిన్నా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పలు ప్రణాళికలు సిద్ధం చేసిందని, అందులో భాగంగా క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి నిధులు విడుదల చేస్తుందన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు సంపాదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగనంపూడి: జనవరి నుంచి ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధించనున్న క్రమంలో వ్యాపారులు పూర్తిగా వినియోగించడం, విక్రయించడం మానుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని 86వ వార్డు సచివాలయ కార్యదర్శి జి.రాజు, కె.దేముడు హెచ్చరించారు. కూర్మన్నపాలెం ముస్తఫా కూడలిలో ప్లాస్టిక్ సంచుల వినియోగం, నిషేధంపై గురువారం అవగాహన కల్పించారు. తోపుడు బళ్లు, కాయగూరల దుకాణాలు, కిరాణా దుకాణాల వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు లక్ష్మీకాంతమ్, సహజ, లోకేశ్వరి పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల వితరణ



చీరలు, దుప్పట్లు అందుకున్న పేదలు

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నిరుపేదలకు చీరలు, దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. దాతలు వి.మాలతీదేవి, రవీంద్రకుమార్, అనిత సహకారంతో పేద వృద్ధులు, మహిళలకు వీటిని అందించారు. ముందుగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం హారతి, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి పూజలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కె.వి.రమణారెడ్డి, డి.వ్యాసశర్మ, పి.రామారావు, పీఎల్ఎన్.రాజు, సత్యలక్ష్మి, ఆర్.సత్యశ్రీదేవి, పంకజ తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా గ్రీన్‌బెల్ట్‌ల అభివృద్ధి



గ్రీన్‌బెల్ట్‌ల అభివృద్ధిపై అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: గ్రీన్‌బెల్ట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చి**దిద్దేందుకు చేపట్టిన పనుల**ను వేగవంతం చేయాలని **జీవీఎంసీ డిప్యూటీ మే**యర్ జియ్యాని శ్రీధర్ **అన్నారు. 52వ వార్డులోని** గ్రీన్‌బెల్ట్ వాకింగ్ ట్రాకుల్లో **జీవీఎంసీ అధికారులతో** కలిసి గురువారం ఆయన **పర్యటించారు. మద్రి పాలెం** వుడా లేఅవుట్ ప్రాంతం**లో పాస్‌పోర్ట్ ఆఫీస్ ఎదు**రుగా ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో **మోడల్ లైటింగ్, బ్యూటిఫికే**షన్, వాటర్ సప్లై మొద**లైన అభివృద్ధి పనులపై ఆ**యన అధికారులతో చర్చిం**చారు. అనంతరం నవ్యాంధ్ర** స్కూల్ ఎదురుగా ఉన్న **గ్రీన్‌బెల్ట్ వాకింగ్ ట్రాక్‌లో** జిమ్ పరికరాలు, అక్కడ కావలసిన పలు మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఉషారాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, పారిశుద్ధ్య విభాగం అధికారి మూర్తి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డిమాండ్లు సాధించే వరకు పోరాటం



దీక్షా శిబిరంలో పాల్గొన్న నేవల్ సీఈ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: సస్పెన్షన్‌కు గురైన 36 మంది ఎన్ఏడీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, స్టోరేజీ ఓటీని పునరుద్ధరించాలని ఎన్ఏడీ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నేవల్ ఆర్మమెంట్ డిపో సమీపంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరానికి పలు కార్మిక సంఘాలు, కార్మిక నాయకులు సంఘీభావం తెలిపారు. జీవీఎంసీ కార్పొరేటర్ గంగారావు గురువారం దీక్షా శిబిరంలో పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఏడీ యాజమాన్యం చర్యలు కక్షపూరితమైనవని విమర్శించారు. కార్మికులపై పెట్టిన కేసులను విత్‌డ్రా చేసుకోవాలని కోరారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటీ ఇవ్వని యాజమాన్యం అదనపు పని గంటల్లో పని చేయించుకుంటున్నారన్నారు. సీజీఎం కార్మికుల చేత చట్టవిరుద్ధంగా పనిచేయించుకున్నారని విమర్శించారు. సీజీఎంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. స్టోరేజీ ఓటీ ఇవ్వడంతోపాటు ఆరుగురిపై పెటిన పోలీస్ కేసును వెనక్కి తీసుకోవాలని, సస్పెండ్ చేసిన 36 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని చెప్పారు.

పారిశ్రామిక వాడపై మంచు దుప్పటి



ఉదయం 8 గంటల సమయంలో వీడని పొగ మంచు



మల్కాపురం-నౌసేనబాగ్ రోడ్డులో కమ్మేసిన మంచు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వారం రోజులుగా పొగ మంచు అల్లుకుంటోంది. శీతాకాలంలో సాయంత్రం మొదలై రాత్రి వరకు దట్టంగా మంచు పడేది. ఇప్పుడు పగటి పూట కూడా మంచు ఎక్కువగా కురుస్తోంది. ఉదయం 8 గంటల సమయంలోనూ వాహనాలు లైట్లు వేయకుండా ప్రయాణించ లేని విధంగా మంచు దుప్పటి కమ్మేస్తోంది. తుఫాన్ కారణంగా రెండు రోజులుగా పారిశ్రామిక ప్రాంతంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. సూర్యుడు ఎక్కడా కనిపించక పోవడంతో ఎండ లేక ఒకవైపు.. వాన చినుకులు మరోవైపు వెరసి చలితో జనం గజగజ వణుకుతున్నారు. చలికాలంలో కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు.

పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



మల్కాపురం జీవీఎంసీ పాఠశాల వద్ద ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ

మల్కాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గురువారం ములగాడ మండల పరిధిలోని జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ముందుగా 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల వద్దకు వెళ్లి ఉపాధ్యాయులను కలుసుకుని ఓటు అభ్యర్థించారు. అనంతరం మల్కాపురం జీవీఎంసీ పాఠశాల వద్దకు వెళ్లి ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థించి, తనకు ఒక్క అవకాశమివ్వాలని, తాను గెలిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ములగాడ మండల అధ్యక్షుడు రామలింగారావు, కార్యదర్శి వాసు, జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, కార్యదర్శి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ రావు, ఎం.ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తెలిపారు. వార్డులోని కాకానినగర్, కనకమహాలక్ష్మీనగర్‌లో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి జీవీఎంసీ అధికారులతో కలిసి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. కాకానినగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి మేరకు రూ.19.82 లక్షల జీవీఎంసీ వార్డు అభివృద్ధి నిధులు మంజూరు చేయించామన్నారు. పనులు సకాలంలో, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 90వ వార్డు కొండవాలు ప్రాంతం లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో అమ్మవారి పాదాలు ఎగువ ప్రాంతంలో రక్షణ గోడల నిమిత్తం జరుగుతున్న మట్టి పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ విభాగం ఏఈ వెంకట్ లక్ష్మి, కాకానినగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్, కార్యదర్శి సిద్ధ రాజాభాస్కర్, విమాన్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టిపాటి సురేష్, కనకమహాలక్ష్మి నగర్ ప్రతినిధులు ఇడదాసరి గోపాల్, జీవీఎంసీ పబ్లిక్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: జ్ఞానాపురం రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గల యాచకులకు శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ మాట్లాడుతూ నగరంలో రాత్రి వేళల్లో పలు ప్రాంతాల్లో చలిలో యాచకులు, నిరాశ్రయులు నిస్సహాయ స్థితిలో తలదాచుకోవడం తమ సంస్థ సభ్యులు గుర్తించారన్నారు. తమ వంతుగా వారికేమైనా సహాయం చేయాలని ఆలోచించి రగ్గులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సుమారు 100 మందికి రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీవీ చారి, మనీషా, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

ఆరిలోవ: ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. మైక్ పట్టుకొని సీఐ ప్రచారం చేపట్టారు. రహదారిపై ఆగి ఉన్న ద్విచక్ర వాహన చోదకుల వద్దకు వెళ్లి హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ఉపయోగం వివరించారు.